క్లుప్తంగా

నేటి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 9, 37 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ వార్డు లక్ష్మీనగర్ కాలనీ సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 37వ వార్డు గంగానమ్మపేట భవనం వారి వీధి సచివాలయం వద్ద మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

జ్వరాలపై వైద్యులకు అవగాహన



తెనాలిరూరల్: స్థానిక బోసు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు. శీతాకాలంలో కురుస్తున్న వర్షాల వల్ల విపరీతంగా పెరుగుతున్న జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గైనకాలజీలో నూతన సర్జరీలపై అవగాహన కల్పించారు. ట్రోపికల్ ఫీవర్స్ అనే అంశంపై డాక్టర్ జె.పూర్ణచంద్రరావు ప్రసంగించారు. గైనకాలజీలో నూతన సర్జరీలను డాక్టర్ అశ్విని వివరించారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, కార్యదర్శి పావని ప్రియాంక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.దక్షిణామూర్తి, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ విశ్వమోహనరావు, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ



తెనాలిరూరల్: అంగలకుదురు గణేష్ యూత్ ఆధ్వర్యంలో జేఎంజే స్వధార్ హోంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఎంతో సందడిగా జరిగాయి. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథలకు యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి దుస్తులు పంపిణీ చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జేఎంజే కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ దెరిస్సమ్మ విచ్చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, ప్రభువు శాంతి సందేశాన్ని అందించారు. స్వధార్ కేంద్రానికి అండదండలుగా ఉంటున్న మురళీకి ధన్యవాదాలు తెలిపారు. మురళీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభువు చూపిన మార్గంలో నడుస్తూ తోటి వారికి సహాయపడాలని సూచించారు. కేంద్రంలోని వారికి నూతన వస్త్రాలు, స్వీట్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ సభ్యులు బొద్దులూరి వేణు, ఎల్ఎంఎల్ ఖాదర్, షేక్ నసీం, నిజాముద్దీన్, సాంబశివరావు, సిస్టర్ హృదయ మేరి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



తెనాలిటౌన్: పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో శ్రీ వాసవీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామ శరణ ఘోషతో మార్కెట్ ఏరియా మారుమోగింది. 18మెట్ల పూజను జరిపారు. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు. గురుస్వాములు మైలా సాంబయ్య, శంకర్‌స్వామి పూజను నిర్వహించారు. కార్యక్రమాన్ని బూర్లగడ్డ రామకృష్ణ, పద్మనాభుని కార్తీక్, గుర్రం చందు, గాదంశెట్టి శ్రీనివాసులు, కొత్తమాసు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి



తెనాలిఅర్బన్: పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.మాధవరావు అన్నారు. అసోసియేషన్ తెనాలి సమావేశాన్ని ఆదివారం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో నిర్వహించారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు మాతాంగి సత్యసాగర్, సభ్యులు చింప్పయ్య, అజ్గర్ ఆలీ, జి.సూర్యప్రకాశరావు, సీహెచ్.మాధవరావు, వి.విఠలరావు, పి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సంతోషాల మధ్య క్రిస్మస్ జరుపుకోవాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



32వ వార్డులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగల్లో క్రిస్మస్ ఒకటని, అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 32వ వార్డులో పిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. శాంతి, కరుణ, దయ వంటి లక్షణాలను అందరూ అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, పిల్లి నాగమణి, సతీష్, మణి, గౌస్, వంశీ, కృష్ణ, బన్ను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

+ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తెనాలి కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు పాస్టర్లు పాల్గొని క్రీస్తు పుట్టుకలోని ఆంతర్యాన్ని తెలియజేశారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కమిటీ సభ్యులు కట్ చేసి, అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే బీజేఆర్ తెనాలి కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ సుకుమార్, బీజేఆర్ అధ్యక్షుడు మేకల సురేష్, ఉపాధ్యక్షుడు నలుకుర్తి రమేష్, ప్రధాన కార్యదర్శి సద్గుణరావు, కార్యదర్శి కొమ్ము రాయల్, కోశాధికారి సిద్దెల కమలాకరరావు, గౌరవాధ్యక్షుడు అత్తోట శరత్‌బాబు, గౌరవ సలహాదారులు అత్తోట చంటి, సుద్దపల్లి నాగరాజు, ఇందుపల్లి రాజారాం, కార్యవర్గ సభ్యులు పి.ప్రేమ్‌కుమార్, టి.రాజాగోపాల్, కె.బోసుబాబు, టి.జయప్రకాష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవండి



మెరిట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న రామచంద్రప్రభు

తెనాలిఅర్బన్: పేదలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ప్రముఖ వ్యాపారి, తులసీ సీడ్స్ అధినేత తులసీ రామ్‌చంద్రప్రభు అన్నారు. శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలిలోని ఓ కల్యాణ మండపంలో మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. విశ్రాంత జీఎస్టీ కమిషనర్ రంగిశెట్టి మంగబాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 19 సంవత్సరాల నుంచి ఈ సంస్థ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత చందు రామారావు మాట్లాడుతూ పేదరికంతో చదువుకునే విద్యార్థుల ఆవేదన తనకు తెలుసునన్నారు. సంస్థ అధ్యక్షుడు బొల్లిముంత వెంకట నారాయణ మాట్లాడుతూ 2002లో రూ.20వేలతో ప్రారంభించిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ నేడు సుమారు రూ.12లక్షలకు చేరిందని చెప్పారు. 358 మందికి వీటినందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త అరవ రామకృష్ణ, సంస్థ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి, చందు శ్రీనివాసరావు, బళ్ళ నరేంద్రకుమార్, తోట రాఘవరరావు, బడే ప్రభాకర్, కె.వెంకటేశ్వరరావు, అమరేశ్వరరావు, చింతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంఘాల నేతలు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయటంతో పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈ నెల 20న తెనాలిలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. స్థానిక ఎన్జీఓ కల్యాణ మండపంలో సాయంత్రం 5 నుంచి 7.30 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్), జన విజ్ఞాన వేదిక (జేవీవీ), ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ), భారత విద్యార్థి సంఘం (ఎస్ఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభ్యర్థులకు పరీక్ష విధానం, సిలబస్ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. 120 పేజీల మెటీరియల్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయా సంఘాల నేతలు కుర్రా శ్రీనివాసరావు, అమిరిశెట్టి శ్రీదర్, షేక్ అహ్మద్ హుస్సేన్, ఎన్జీవో నాయకులు బేతాల కృష్ణమోహన్, టి.మధుకుమార్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళ పాత్ర ప్రధానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

నారీ శక్తి సమ్మేళనంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి

గుంటూరు మెడికల్/ గుంటూరు రూరల్ : దేశవ్యాప్తంగా మహిళ సమన్వయ్ ఢిల్లీ సంస్థ ఆధ్వర్యంలో 400 ప్రదేశాల్లో ఆదివారం నారీ శక్తి సమ్మేళనం నిర్వహించారు. అందులో భాగంగా గుంటూరు లాల్‌పురం రోడ్డులోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమానికి జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ మహిళల్లో ఉన్న సుగుణాలు సమాజాభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. నారీ శక్తి స్టేట్ కో-ఆర్డినేటర్ సాధినేని యామిని శర్మ మాట్లాడుతూ మహిళా సమాజ నిర్మాణం కోసం, పర్యావరణ పరిరక్షణ, దేవాలయాల పునరుద్ధరణ, సంస్కారవంతంగా పిల్లలని పెంచడం తదితర విషయాలపై మాట్లాడారు. ప్రతి మహిళా సమాజానికి కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ రోడ్డు సెఫ్టీ ఆవశ్యకత, సమాజంలో మహిళల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ ట్యాక్స్ సీనియర్ అకౌంట్ ఆఫీసర్ కల్పన, న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ, నారీ శక్తి కన్వీనర్ విజయలక్ష్మి, సహ కన్వీనర్ గీత, సామాజిక కార్యకర్త ముదిగొండ సుష్మ, ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణప్రశాంతి, ప్రముఖ న్యాయవాది విజయభారతి, స్వాగత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం పెన్షనర్స్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ సీనియర్ పెన్షనర్ సభ్యులైన విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ సి.శేషగిరిరావు, విశ్రాంత ఎంఈవో ఎస్.గోపాలకృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, తెలుగు పండితులు రాజన్న మాస్టర్ మాట్లాడుతూ పింఛన్‌దారుల ప్రశాంత జీవనానికి ఎనలేని కృషి చేసిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు డి.ఎస్.నకారా, అప్పటి భారత 16వ ప్రధాన న్యాయమూర్తి వై.వి చంద్రచూడ్‌కు పెన్షనర్లు జీవితాంతం రుణ పడి ఉంటారని తెలిపారు. విశ్రాంత ఇంజనీర్ సదాశివం మాట్లాడుతూ 1922 జనవరి 1 నుంచి దేశంలో అమల్లోకి వచ్చిన ఫండమెంటల్ రూల్స్‌లో పెన్షన్‌ను ఒక హక్కుగా పొందుపరచలేదన్నారు. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారులుగా ఉండి 1972లో రిటైర్డ్ అయిన డి.ఎస్. నకారా పెన్షనర్ల అనేక సమస్యలపైన పిటిషన్ వేసి సుదీర్ఘకాలం పోరాడి, అనుకూలంగా చారిత్రాత్మకమైన తీర్పుని సాధించారని గుర్తు చేశారు.

ఏపీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరసింహారావు

తాడికొండ: ఏపీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాడికొండకు చెందిన తోకల నరసింహారావు నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించిన ఏపీ ఎరుకల సంఘం అధ్యక్షుడు పాలపర్తి శ్రీనివాస చక్రవర్తికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో ఎరుకల హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేసి సంఘాన్ని, కులాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

గురువులకు సత్కారం



తెనాలిటౌన్: అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు నేర్చుకున్న మహిళలు ఆదివారం కొల్లూరు వారి వీధిలోని సీతారామాంజనేయ దేవస్థానం ఆవరణలో గురువులు కొండపి వసుంధర, శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు. అన్నమయ్య సంకీర్తనలు నేర్చుకున్న 54మంది తిరుమల నాద నీరాజనంలో సంకీర్తన గానం చేసి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, మనిషిలో ఉన్న ఏకాగ్రతను భగవంతుని వైపు మరల్చడానికి సంగీతం దారితీస్తుందని తెలిపారు. అందె బాలచంద్రమౌళి, మాదాల రూపశ్రీ, అందె తన్మయి, దేవి లలిత, లక్కరాజు కనక దుర్గ, అందు రాజేశ్వరి, రామలక్ష్మి, అనిత, అన్నపూర్ణ, మౌనిక, కేశవరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో సెమీ క్రిస్మస్ వేడుకలు



తెనాలిఅర్బన్: సెమీ క్రిస్మస్ వేడుకలను తెనాలి ఆర్టీసీ డిపోలో ఆదివారం ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పాస్టర్ హనోక్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు అభిరాం, ఐమళ్ళ రాజేష్‌ఖన్నా, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

శివయ్య సన్నిధిలో భక్తిశ్రద్ధలతో హోమాలు, యాగాలు



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాద కుండాత్మక సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహ లక్ష్మీ గణపతి మహా యాగం క్రతువును వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. విష్ణుభట్ల ఆంజనేయ చయనుల ఆధ్వర్యంలో ఆరు రోజుల మహా యాగం, హోమాలు ఆదివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి చండీ, రుద్ర, నవగ్రహ హోమాలు, శ్రీ చక్రార్చన, వేదపారాయణలు, బాల, సువాసినీ పూజలు, జపాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి హోమాలు, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు చండీ హోమ పూజల్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు ఎస్. శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ధనుర్మాస వ్రత మహోత్సవం ప్రారంభం



తెనాలిటౌన్: పట్టణంలోని వీఎస్ఆర్ కాలేజ్ రోడ్డులో వడ్లమూడి హాస్పిటల్ పక్కన స్థలంలో శ్రీ శరణాగంగోస్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నరేంద్ర రామానుజదాస స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్సవాలు జనవరి 14 వరకు జరుగుతాయి. ధనుర్మాస వ్రతంతో ఉత్సవాలను రామానుజదాస స్వామి ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 5.30గంటలకు తిరుమంజనం, 8గంటలకు అష్టోత్తర శతనామార్చన, 8.30గంటలకు తిరుప్పావై సేవ, 9.30గంటలకు గో పూజ, 10గంటలకు తీర్థ గోష్టి జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 6నుంచి 7గంటల వరకు నరేంద్ర రామానుజదాస స్వామి తిరుప్పావై ప్రవచనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

విజయకీలాద్రిపై ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం



గోదాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఇంటింటికి తీసుకెళ్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఆదివారం శ్రీ గోదా అమ్మవారికి అష్టోత్తర శత నామార్చన, సారె సమర్పణ, నిర్వహించామని తెలిపారు. ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ఇంటింటికి ధనుర్మాసం కార్యక్రమం చేపట్టామని, విజయకీలాద్రిపై అర్చక బృందం, శ్రీ గోదాదేవి అమ్మవారిని భగవత్ భక్తుల ఇంటికి తీసుకు వెళ్లి వారి ఇంటివద్దనే ధనుర్మాస వ్రత మహోత్సవాన్ని జరిపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదాదేవిని దర్శించుకుని, ఆమె అనుగ్రహాన్ని పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని చెప్పారు.

చరిత్రను విస్మరిస్తే జాతుల మనుగడ ప్రశ్నార్థకమే

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖరరావు



మాట్లాడుతున్న సోమశేఖరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వర్తమాన, భావితరాలకు తమ గత చరిత్రల్ని అధ్యయనం చేసే అవకాశం పాలకులు కల్పించకపోతే ఆ జాతుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలెక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖరరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం గుంటూరు జిల్లా చరిత్ర సంఘ 29వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. చరిత్ర కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న సోమశేఖరరావు మాట్లాడారు. గతంలోని దుర్మార్గాలు, మంచి చెడుల్ని తెలియజేస్తూ భవిష్యత్ తరాల్ని నాగరిక జీవన విధానానికి తీసుకు వెళ్లేది చరిత్ర మాత్రమేనని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా చరిత్ర సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకువచ్చి అమలు చేయడం ఒక్కటే మార్గమని తెలిపారు. అందుకు భారతదేశం చొరవ చూపాలని కోరారు. అనంతరం కేఎల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ బుడ్డిగ జమీందార్ వ్యాసాల సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంతెన వెంకటరాజు స్మారకోపాన్యాసాన్ని వై.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన 'విద్యా వ్యవస్థలో చరిత్ర- మార్పులు, వ్యాఖ్యానాలు' అంశంపై చరిత్ర సమీక్షకులు కొప్పర్తి వెంకటరమణమూర్తి మాట్లాడారు. 'భారత రాజ్యాంగం-లౌకికవాదం' అంశంపై సయ్యద్ అమీర్ అధ్యక్షతన ఏఎస్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అంజిరెడ్డి ఉపన్యసించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు, సి.ఎస్.ఆర్. ప్రసాద్, పలువురు చరిత్ర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, చరిత్ర అభిమానులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



పిరమిడ్ సొసైటీ ఫర్ స్పిరిట్యువల్ అధినేత సుభాష్ పత్రి సంస్మరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత

తాడేపల్లిరూరల్: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత సాధించవచ్చనని సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేవీవీ సరిత అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని మానస సరోవర ధ్యాన ఆశ్రమంలో విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమి వ్యవస్థాపకుడు నాట్య కళాశిఖామణి బిరుదాంకితులు మట్టుపల్లి కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో పిరమిడ్ సొసైటీ ఫర్ స్పిరిట్యువల్ అధినేత సుభాష్ పత్రి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. సరిత మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న అసహనం వలన సమాజంలో తలెత్తే పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ సంతృప్తికరమైన జీవితానికి అలవాటు పడాలని, అనవసర తాపత్రయాలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని అన్నారు. నాగార్జున యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డీన్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ సంగీతం, డ్యాన్స్, అభినయం తదితర కళలను అందించేందుకు కేవలం ఆరు నెలల్లో ప్రయత్నం చేసి సాధించానని తెలిపారు. అనంతరం వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

జస్టిస్ రోహిణి కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న రమణ

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన జస్టిస్ రోహిణి కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ కార్యాలయంలో ఆదివారం బీసీ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు దుర్గారావు అధ్యక్షతన బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బీసీల అంశంలో అన్ని రాజకీయ పార్టీలు దాటవేత ధోరణి కనపరుస్తున్నారని తెలిపారు. చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి నాయకులు శరబలింగం విజయలక్ష్మి, వేణు, బుజ్జమ్మ, ప్రేమ్‌రాజ్, తాడికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుంటూరు పార్లమెంట్ సీటు ఓబీసీలకు కేటాయించాలి

గుంటూరు పార్లమెంటు సీటును ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని అఖిల భారత ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ కోరారు. బ్రాడీపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వర్గాల్లోని 139 కులాల్లో 61 కులాలు గుంటూరు పార్లమెంట్ పరిధిలో మెజార్టీ ఓటర్లుగా ఉన్న నేపథ్యంలో వారికే పార్లమెంటు సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన చిన్నారుల జానపద నృత్యాలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కారభారతి అధ్యక్షుడు ఇంద్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో భారత మాత పూజా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చిన్నారులు జానపద పోటీల్లో నృత్యాల్ని ప్రదర్శించి ఆహూతుల్ని అలరించారు. అనంతరం జూనియర్స్‌కు వ్యాసరచన పోటీలు, సీనియర్స్‌కు జీ-20 సదస్సుపై పోటీలు, మహాభారతంలోని అరణ్య వాసంపై అవగాహన పరీక్షలు జరిగాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు విద్యార్థులకు చక్కటి సందేశాల్ని అందించారు.